# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సంస్థల గౌరవ ఛైర్మన్ రతన్ టాటా గత రాత్రి కన్నుమూశారు.**
2. **రక్తహీనతను తగ్గించేలా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేసేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
3. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ -టీసిఎస్ ఐటీ సర్వీసెస్‌ను ప్రారంభించనుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో వరద సాయం కింద 4.06 లక్షల మందికి 6 వందల కోట్ల రూపాయలను అందించామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**
5. **తెలంగాణలో షెడ్యూల్డ్ కులాలు-ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయనున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

==========================

ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సంస్థల గౌరవ ఛైర్మన్ రతన్ టాటా కన్నుమూశారు. ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత రాత్రి తుదిశ్వాస విడిచారని టాటాసన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తెలిపారు. 1937 డిసెంబరు 28న మహారాష్ట్రలోని ముంబైలో జన్మించిన రతన్ టాటా 1990 నుంచి 2012 వరకు టాటా సంస్థల ఛైర్మన్‌గా వ్యవహరించారు.

రతన్ టాటా మృతి పట్ల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

-------------------------

రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాన్ని అధిగమించేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేసేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిన్న ఢిల్లీలో సమావేశమైంది. మంత్రి వర్గం నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో పాత్రికేయులకు వివరించారు."ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన" తో పాటు ఇతర సంక్షేమ పథకాల కింద ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయనున్నామని తెలిపారు. పోషకాహార భద్రతకు

భరోసా కల్పించే – సమ్మిళిత అభివృద్ధికి ఇది ఒక ముందడుగు అని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (28 సెకన్లు)

అలాగే "వికాస్ భీ విరాసత్ భీ" కార్యక్రమంలో భాగంగా గుజరాత్‌లోని లోథాల్‌లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్‌కు, రాజస్థాన్, పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో 2 వేల 280 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

---------------------------

దేశంలో సుస్థిర పాలనకు జమిలి ఎన్నికలు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉండవల్లిలో ముఖ్యమంత్రి నిన్న మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు రావడం వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోందని అన్నారు. పార్లమెంటు, శాసన సభ, స్థానిక సంస్థలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎన్నికల వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. సుస్థిర పాలన ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. సుపరిపాలనను అందించడం ద్వారా హర్యానాలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్–టీసీఎస్ సంస్థ ఏర్పాటు కానుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. విశాఖలో భారీ పెట్టుబడుల ద్వారా టాటా గ్రూపు దాదాపు 10వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుందని ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలు, ఏరోస్పేస్, పర్యాటక, ఉక్కు రంగాల్లో పెట్టుబడులను పరిశీలిస్తామని టాటా సంస్థ తెలిపిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల సంభవించిన వరదల వల్ల ప్రభావితమైన 4.06 లక్షల మందికి 6 వందల కోట్ల రూపాయలను వరద సాయం కింద అందించామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వరద సాయం వివరాలను రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, వి.అనితలతో కలిసి మంత్రి నిన్న పాత్రికేయులకు వివరించారు. వరద ముంపు సమయంలో ప్రతి రోజూ 12 లక్షల ఆహార పొట్లాలు, 30 లక్షల వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, పాల ప్యాకెట్లు అందజేశామని చెప్పారు. విజయవాడ నగర పరిధిలో తాత్కాలిక వసతికి 8.42 కోట్లు, ఆహారానికి 92.51 కోట్లు, తాగునీటికి రూ. 11.22 కోట్లు, వైద్యసేవలకు 4.55 కోట్లు, పారిశుద్ధ్య పనులు, పునరావాస శిబిరాలకు 20.56 కోట్ల రూపాయలు ఖర్చుచేశామని చెప్పారు. అలాగే విద్యుత్ లైట్లు, జనరేటర్లు, కొవ్వొత్తులు తదితరాలకు 23 లక్షల రూపాయలు కలిపి మొత్తం 139.44 కోట్ల రూపాయలను ఖర్చుచేశామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో షెడ్యూల్డ్ కులాలు–ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయనున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి నిన్న సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వర్గీకరణ అమలు కోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని 60 రోజుల్లో

నివేదిక ఇచ్చేలా ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ నివేదిక వచ్చాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించాలని, ఇందుకు కమిషన్‌కు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

-----------------------------

తెలంగాణలో ధాన్యం సేకరణకు సంబంధించిన పలు అంశాలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారని తెలిపింది. గోదాముల లీజు, బియ్యం మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు, మిల్లింగ్ ఛార్జీలు, తదితర అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని అధికారులు తెలిపారు.

-----------------------------

విజయనగరం వైభవాన్ని, సంస్కృతిని చాటి చెప్పే విధంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై మా ఆకాశవాణి విజయనం నగరం జిల్లా ప్రతినిధి కె.ఎన్. రామకృష్ణ మరిన్ని వివరాలను అందజేస్తారు.

..వాయిస్... 32 సెకన్లు

-----------------------------

మారుమూల ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి ఆర్టీసీ డిపోకి చెందిన ఆరు నూతన బస్సులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆర్టీసీ బలోపేతానికి ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు.తెనాలి డిపో నుండి 100 బస్సులు ద్వారా వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసేలా చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు

-----------------------------

తెలంగాణలో గ్రూప్ 1 పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు ఈ నెల 14వ తేదీ నుంచి అందుబాటులో ఉంటాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్– టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి జరగనున్న గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష హాల్ టికెట్లను టీజీపీఎస్సీ అధికారిక వెబ్ సైట్ నుండి అభ్యర్థులు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్లు డౌన్ లోడ్ లో ఏదైనా సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్ లేదా కమిషన్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 21 తేదీ నుండి 27వ తేదీ వరకు గ్రూప్ మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి.

-----------------------------

మానసిక సమస్యలపై అవగాహన పెంచడం కోసం ఈ రోజు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రపంచ సమాఖ్య చొరవతో ప్రతి ఏటా అక్టోబర్ 10వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని మొదటి సారిగా 1992వ

సంవత్సరం అక్టోబర్ 10వ తేదీన నిర్వహించారు. మానసిక ఆందోళన ..., కుంగు బాటు ...., ఫోబియా ...., మానియా వంటి రుగ్మతలన్నీ మానసిక అనారోగ్యానికి చిహ్నాలు. మానసిక వైద్య నిపుణుల ద్వారా ఈ రుగ్మతలకు తగిన చికిత్స పొందవచ్చు. అను నిత్యం యోగాభ్యాసం ద్వారా మానసిక వైకల్యాన్ని అధిగమించవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

కాగా.. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం 4వ సంచిక ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

======================